సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 2 । జనవరి । 2024



ఐదో శక్తిపీఠం.. జనసంద్రం

అలంపూర్‌లోని జోగుళాంబ, బాలబ్రహ్మే శ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

వివరాలు 8లో ▸



పాలమూరులో క్రీడాసౌరభం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం 33.1 /10.8

వాతావరణం

చలి తీవ్రత అధికంగా ఉండి అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం . రాత్రివేళలో చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఆర్యవైశ్యులు ఐకమత్యంతో మెలగాలి



కల్వకుర్తి రూరల్: సమాజంలోని ఆర్యవైశ్యులు ఐక్యమత్యంతో మెలగాల్సిన అవసరం ఉందని ఆర్యవైశ్య మహాసభ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో 2024 నూతన సంవత్సర జిల్లా క్యాలెండర్‌ను రామకృష్ణ, కన్యకాపరమేశ్వరీ దేవస్థానం చైర్మన్ జూలూరు రమేష్‌బాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడారు. ఆర్యవైశ్యులందరూ కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి సభ్యత్వాన్ని పెంచడంతో పాటు జిల్లా వ్యాప్తంగా నూతన మండల, పట్టణ కమిటీలను త్వరలోనే ఎన్నుకుందామని తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్, కోశాధికారి శివ, జగదీశ్వర్, అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస్, పీఆర్‌ఓ రాజయ్య, శేఖర్, శివాలయం శ్రీనివాస్, వెంకటేష్, ప్రవీణ్, సతీష్, శ్రీనివాస్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అటవీశాఖ అధికారుల కమిటీ ఎన్నిక

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా అటవీ శాఖ అధికారుల సంఘం నూతన కమిటీ ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా నిరంజన్, ఉపాధ్యక్షులగా మురళీధరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరేందర్, జాయింట్ కార్యదర్శిగా నవీన్‌రాజు, కోశాధికారిగా సుకన్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నిరంజన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించుకునేందుకు కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. అటవీశాఖ అధికారుల సమస్యలు ఏమైనా ఉంటే సంఘం దృష్టికి తేవాలని, వచ్చిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రజనందగోల్‌లో ఈనెల 4 నుంచి ప్రారంభమయ్యే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–14 జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు అబ్దుల్ అఫ్నాన్, అండర్–17 పోటీలకు ఎస్.హర్షిత ఎంపికయ్యారు. పోటీల్లో ప్రతిభచాటి ఉమ్మడి జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.



అబ్దుల్ అఫ్నాన్



ఎస్.హర్షిత

ఊతమిచ్చేనా?



ఊర్కొండ మండలం మాదారంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు(ఫైల్)

- వ్యవసాయానికి ఉపాధిహామీ అనుసంధానం చేస్తామని కేంద్రం ప్రకటన
- ..ఆ దిశగా ఎదురుచూస్తున్న రైతులు
- కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు
- పెరుగుతున్న పెట్టుబడులు

జిల్లాలోని జాబ్‌కార్డులు	మంది కూలీలు
1,11,385	1,86,464

నాగర్‌కర్నూల్: జిల్లాలో ప్రధానంగా వ్యవసాయమే జీవనాధారంగా బ్రతుకుతున్న రైతులు చాలా మందే ఉన్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ పంటలు సాగు చేస్తుంటారు. అయితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని పథకాలు తీసుకొచ్చినా.. నానాటికి పెరుగుత్ను ఖర్చులతో రైతులు అదనపు భారాన్ని మోయాల్సి వస్తోంది. ఇందు కోసం కేంద్ర ప్రభుత్వం ఖర్చులను తగ్గించేందుకు గాను వ్యవసాయాన్ని ఉపాధికి అనుసంధానం చేయాలని ప్రతిపాదనలు తీసుకొచ్చింది. కాగా ఇప్పటి వరకు ఈ పథకం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో ఉపాధి పథకం వ్యవసాయ పనులకు అనుసంధానం చేస్తారని ఎంతో మంది రైతులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరుగుతున్న కూలీల ఖర్చు..

కూలీలు దొరకక రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఎదరవుతోంది. పంట చేతికి వచ్చిన వ్యవసాయ భూముల్లో పత్తి తీసేందుకు, కలుపు తీసేందుకు, వరి నాట్లేసేందుకు, వరి కోసేందుకు కూలీలు దొరకని పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు తమ అవసరాలకు నిమిత్తం రైతులకు రోజుకు రూ.500 నుంచి రూ.1,000 వరకు చెల్లించి రైతులను తెచ్చుకుంటున్నారు. అయితే పేద, మధ్య తరగతి రైతులు మాత్రం కూలీలు డిమాండ్ చేస్తున్న కూలి చెల్లించేందుకు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేస్తామన్న ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఉపాధిహామీ పథకం అనుసంధానంపై రైతులు ఆశలు పెరిగాయి.

ఎలాంటి ఆదేశాలు రాలేదు..



వ్యవసాయానికి ఉపాధి హామీ అనుసంధానికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి విధివిధానాలు రాలేదు. అనుసంధానం చేస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. దీనికి సంబంధించిన ఏమైనా ఆదేశాలు వస్తే అమలు చేస్తాం.

– నర్సింగరావు, డీఆర్‌డీఓ

కూలీలకు, రైతులకు లాభమే...

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులకు తగినంత తోడ్పాటును అందించాలనే ఉద్దేశంతో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ పనులకు అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ కమిటీ సిపార్సు చేసింది. వ్యవసాయ పనుల్లో 75 శాతం రైతులు, 25 శాతం ఉపాధి నిధుల ద్వారా కూలీల ఖర్చులు భరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఖర్చులను భరించాలని కమిటీ పేర్కొంది. ఈ కమిటీ సూచనలను అమలు చేస్తే వ్యవసాదారులతో పాటు జిల్లాలో 1,11,385 జాబ్ కార్డుల ద్వారా 1,86,464 కూలీలకు మేలు జరగనుంది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నా.. అది ఏమూలన సరిపోవడం లేదు. పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరలను కూడా ప్రభుత్వాలు అందించలేకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. కనీసం వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుంధానం చేస్తే తమ ఖర్చులో 25 శాతం మిగులుతుందని రైతులు తెలియజేస్తున్నారు. కూలీలకు సైతం పనులు దొరికే అవకాశం ఉంటుంది.

ఉమ్మడి జిల్లాలో..
47 మందికి పోలీస్ సేవా పతకాలు

మహబూబ్‌నగర్ క్రైం: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖలో పలు రకాల పతకాలను అందుకోనున్న వారి జాబితాను సోమవారం విడుదల చేయడం జరిగింది. ఇందులో ఉమ్మడి జిల్లాకు సంబంధించి 47 మందికి పతకాలు వరించగా.. వారు వచ్చే గణతంత్ర వేడుకల్లో పురస్కారాలు అందుకోనున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ మహోన్నత సేవా పతకం నారాయణపేట జిల్లా ఏఆర్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సుధాకర్‌రాజు, పోలీస్ ఉత్తమ సేవా పతకం వనపర్తి డీసీఆర్‌బీలో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎం.కురుమూర్తిలకు ప్రకటించారు.



జిల్లాల వారీగా..

మహబూబ్‌నగర్ జిల్లాలో 12 మందికి రాష్ట్ర పోలీస్ సేవా పతకాలు వచ్చాయి. వారిలో ఏఆర్ ఎస్ఐ వెంకటకృష్ణారెడ్డి, ఏఎస్ఐ మణ్యం, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్‌గౌడ్, హెడ్‌కానిస్టేబుల్ రవిజయశంకర్, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌కుమార్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ సదాతుల్లా, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఇప్ప శివారెడ్డి, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి.కృష్ణబాబు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ రాంగోవర్ధన్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ బి.చిన్నయాదయ్య ఉన్నారు.

- వనపర్తి జిల్లాలో అదనపు ఎస్పీ టి.రామదాసు, ఏఎస్ఐ షేక్ మహబూబ్ పాష, ఏఆర్ ఎస్ఐ బి.హేమాజీ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ డి.శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసులు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ మోహిన్, హెడ్‌కానిస్టేబుల్ కె.దామోదర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ ఎం .చంద్రశేఖర్ ఉన్నారు.
- నారాయణపేట జిల్లాలో ఏఆర్ ఎస్ఐ మలక్రయ్య, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ టి.రాంమోహన్ ఉన్నారు.
- గద్వాల జిల్లాలో హెడ్‌కానిస్టేబుళ్లు ఎస్.వీరన్న, విజయ్‌భాస్కర్ రాజు, టి.జ్యోతిప్రకాష్, సి.కృష్ణయ్య, సి.లక్ష్మీనారాయణలకు వచ్చాయి.
- నాగర్‌కర్నూల్ జిల్లాలో ఏఎస్ఐలు చౌదరి ఈశ్వర్, ఎస్.బాలరాజు, ఎండీ అస్లాంఖాన్, ఎంఏ రషీద్, ఏఆర్ ఎస్ఐ బి.మల్లేష్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ ఎండీ జానిమియా, సివిల్ హెడ్‌కానిస్టేబుళ్లు మహ్మద్ మసూద్ పాష, చింతల నారాయణ, కె.శ్రీనివాస్, అంబిక పురేందర్‌నాథ్‌గౌతమ్, రాజన్‌గౌడ్, ఎం.నాగరాజు, ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు యాసిన్ మైనొద్దీన్, పి.వెంకటరాముడు, ఎం.అంజయ్య, ఎ.పురుషోత్తంగౌడ్, ఏఆర్ కానిస్టేబుల్ ఎన్.తిరుపతయ్య, నాగర్‌కర్నూల్ ఎస్ఐ వేముల రామేశ్వర్‌రెడ్డి ఉన్నారు.
- జిల్లా అగ్నిమాపక శాఖలో తెలంగాణ రాష్ట్ర శౌర్య పతకం జడ్చర్ల ఫైర్‌మాన్ సి.నవీన్‌కుమార్‌కు వచ్చింది.

ఎమ్మెల్యేకు తహసీల్దార్ల సన్మానం

కల్వకుర్తి రూరల్: నూతన సంవత్సరం సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని సోమవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో నియోజకవర్గంలోని తహసీల్దార్లు కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, తలకొండపల్లి తహసీల్దార్ ముంతాజ్, కడ్తాల్ తహసీల్దార్ లలిత ఎమ్మెల్యేను కలిసి సత్కరించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న తహసీల్దార్లు

జోష్.. క్యాష్

- అంబరాన్నంటిన డిసెంబర్ 31, నూతన సంవత్సర వేడుకలు
- రెండురోజుల్లో రూ.50.30 కోట్ల మద్యం అమ్మకాలు
- ఇటు వ్యాపారులకు.. అటు ప్రభుత్వానికి కాసుల పంట
- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురు వాహనదారులు
- ఉమ్మడి జిల్లాలో రూ.వంద కోట్లకుపైగానే వ్యాపారం



మహబూబ్‌నగర్‌లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబ్‌నగర్ క్రైం: డిసెంబర్ 31 వేడుకలు అంటే మాములుగా ఉండవు అని మరోసారి నిరూపించారు. ఈ ఒక్కరోజు కోసం అటు వ్యాపారులు.. ఇటు యువత, మందుబాబులు ఎంతో ఎదురుచూస్తుంటారు. ఇందుకు తగ్గట్టుగానే రెండురోజుల్లో మద్యంతోపాటు మాంసం, కేక్‌లు, బిర్యానీలు ఇలా అన్ని రకాల వ్యాపారాలు కలిపి దాదాపు రూ.వంద కోట్ల వరకు వ్యాపారం జరిగింది. ఇక మద్యం అయితే ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో విక్రయించారు. చలి ఉన్న నేపథ్యంలో మందుబాబుల పార్టీలకు అంతే లేకుండా పోయింది. ఆదివారం జరిగిన డిసెంబర్ 31 వేడుకలతోపాటు సోమవారం న్యూ ఇయర్ వేడుకల్లోనూ మద్యం జోష్ కొనసాగింది. గతంలో కంటే ఈసారి మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. డిసెంబర్ 31తోపాటు సోమవారం కలిపి రూ.50.30 కోట్ల మద్యం విక్రయించారు. పెద్దవాళ్ల నుంచి యువత వరకు ఫుల్ ఎంజాయ్ చేశారు. అమ్మకాలు భారీగా ఉండటంతో ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు దుకాణాలు, ఒంటిగంట వరకు బార్లు కిటకిటలాడాయి. ఉమ్మడి జిల్లాకేంద్రమైన మహబూబ్‌నగర్‌తో పాటు జడ్చర్ల, నారాయణపేట, కొత్తకోట, గద్వాల, నాగర్‌కర్నూల్‌లో మద్యం అధికంగా అమ్మకాలు జరిగాయి. ఫలితంగా ప్రభుత్వానికి నాలుగు జిల్లాల నుంచి భారీ ఆదాయమే లభించింది.

సందడే సందడి..

సోమవారం జరిగిన న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్‌లో మటన్, చికెన్ దుకాణాలతోపాటు రెస్టారెంట్లు, ప్రధాన హోటళ్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన హోటళ్లు రద్దీగా కనిపించాయి. దీంతోపాటు బేకరీల్లో సైతం కొనుగోలుదారుల సందడి నెలకొంది. ఇక కేసీఆర్ అర్బన్ ఏకో పార్క్‌లో పట్టణ ప్రజలు కుటుంబాలతో కలిసి వెళ్లి సరదాగా గడిపారు. చిన్నారులు అక్కడ ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో సందడి చేశారు.


రెచ్చిపోయిన మందుబాబులు

కొత్త సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా మందుబాబులు రెచ్చిపోయారు. మోతాదుకు మించి మద్యం తాగిన వారిని బ్రీత్ ఎనలైజర్ ఇట్టే పట్టించింది. డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 22 మందిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధానంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో 11 చోట్ల ప్రత్యేక తనిఖీలు చేపట్టి మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో పోలీసులు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 30 మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా జరిమానా విధించారు. దీంతోపాటు అతివేగం, రాష్ డ్రైవింగ్, మైనర్లు నడుపుతున్న వాహనాలను కూడా అదుపులోకి తీసుకోవడం జరిగింది. ప్రధానంగా ట్రాఫిక్ పోలీసులు ఎక్కువ మంది వాహనదారులను పట్టుకున్నారు. నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌తోపాటు అంబేద్కర్ కూడలిలో నిర్వహించిన తనిఖీలను డీఎస్పీ మహేష్ పరిశీలించారు.

మహబూబ్‌నగర్, జడ్చర్లలో..

ఉమ్మడి జిల్లాలో అత్యధికంగా మద్యం అమ్మకాలు జరిగిన ప్రాంతాలుగా మొదటి స్థానంలో మహబూబ్‌నగర్.. రెండో స్థానంలో జడ్చర్ల నిలిచింది. ఆ తర్వాత కల్వకుర్తి, వనపర్తి, నారాయణపేట, కొత్తకోట ప్రాంతాల్లో మద్యం అధిక సంఖ్యలో అమ్మకాలు జరిగాయి. ఇలాంటి కొన్ని కేంద్రాల్లో ఉన్న మద్యం దుకాణాల నుంచి అధిక సంఖ్యలో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం వచ్చింది. మహబూబ్‌నగర్‌లో 90, నాగర్‌కర్నూల్‌లో 67, వనపర్తిలో 37, గద్వాల జిల్లాలోని 36 మద్యం దుకాణాల్లో మద్యం అమ్మకాల జోరు కొనసాగింది. ప్రస్తుతం ఉన్న మూడు జిల్లాల కంటే మహబూబ్‌నగర్‌లోనే ఎక్కువ మద్యం దుకాణాలు ఉండటం విశేషం. జడ్చర్ల నియోజకవర్గంలో మద్యం అమ్మకాలు భారీ స్థాయిలో పెరిగాయి. ఇక్కడే రూ.5.56 కోట్ల మద్యం అమ్మకాలు జరగడం విశేషం. మొత్తంగా 2023 డిసెంబర్‌లో మద్యం దుకాణాలు కొత్తగా ఏర్పాటు చేయడంతో డిపోల నుంచి ఎక్కువ స్టాక్ కొనుగోలు చేశారు. 2022తో పోల్చితే 2023 డిసెంబర్‌లో 14 శాతం ఐఎంఎల్ అమ్మకాలు పెరిగాయి.

నూతనోత్సాహంతో..



ఎస్పీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు, ప్రత్యేక పూజల నిర్వహణ

నాగర్‌కర్నూల్ క్రైం/ అచ్చంపేట రూరల్/ కందనూలు: నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను సోమవారం జిల్లా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. కొత్త ఏడాదిలో తొలిరోజు దేవుడి దర్శనం కోసం ఆలయాల్లో భక్తులు క్యూ కట్టారు. జిల్లాలోని ప్రధాన ఆలయాలు, శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, వట్టెం వెంకన్న, ఊర్కొండ ఆంజనేయస్వామి, సిర్సనగండ్ల రాములవారి సన్నిధి, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ దేవాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వర దేవాలయం, అయ్యప్ప సన్నిధానం, మార్కెట్‌యార్డు శివాలయం, హనుమాన్ ఆలయం, శివాంజనేయ దేవాలయంలో భక్తుల రద్దీ కనిపించింది. అంతకు ముందు పట్టణాలతో పాటు, గ్రామాల్లో మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. రోజంతా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

ఎస్పీ కార్యాలయంలో..

పోలీసులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమాజసేవ చేయాలని, శాంతి భద్రతలను పరిరక్షిస్తూ.. సమాజంలోని ప్రతి ఒక్కరిని కుటుంబ సభ్యులుగా భావిస్తూ.. ఒకరినొకరు గౌరవించుకోవడం, సహకరించుకోవడంతో ఆనందకరమైన వాతావారణం ఏర్పడుతుందని ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను పోలీస్ ఉన్నతాధికారులు, సిబ్బంది సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడారు. నూతన సంవత్సరంలో శాంతియుత సమాజం ఏర్పాటు కోసం జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. నూతన సంవత్సరంలో ప్రజలు భద్రతతో కూడిన సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్‌తో పాటు పలువురు సిబ్బంది ఉన్నారు.



ఉమామహేశ్వరం ఆలయం వద్ద భక్తులు



జిల్లా కేంద్రంలో రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆశాజనకంగా యాసంగి సాగు

- కోయిల్‌సాగర్ కింద వరినాట్లతో రైతులు బిజీబిజీ
- 6 నుంచి కేఎస్పీ నీటి విడుదల
- పెరిగిన కూలీ రేట్లు
- జిల్లాలో 45 వేల ఎకరాల్లో వరిసాగు

తాడూరు: యాసంగి సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, మిరప పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఇటీవల మిరప పంట తెగుళ్ల బారిన పడి మొక్కలు ఎండిపోయాయి. కేవీకే పాలెం శాస్త్రవేత్తలు మండలంలోని గుంతకోడూరు, ఐతోలు గ్రామాలను సందర్శించి మిరప సాగుకు సంబంధించి సస్యరక్షణ, చీడపీడల నివారణ వంటి వాటిని ఎలా నివారించుకోవచ్చు అనే విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 400కు పైగా ఎకరాల్లో వేరుశనగ సాగు చేయగా, 600 ఎకరాల వరకు మొక్కజొన్న సాగుచేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కేఎల్ఐ కాల్వ ద్వారా వస్తున్న నీటిని చూసిన రైతులు కొందరు సాగు చేసుకోగా.. ప్రస్తుతం నీరు రాకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టారు. మరికొంత మంది రైతులు బోరుబావుల వద్ద సాగు చేసుకున్న పంటలను కాపాడుకుంటున్నారు. స్ప్రింక్లర్, డ్రిప్ వంటి వివిధ ప్రత్యామ్నాయాల ద్వారా పంటలను కాపాడుకుంటున్నారు. వానాకాలంలో నష్టపోయిన రైతులు యాసంగిలోనైనా గట్టెకాలనే నమ్మకంతో యాసంగి పంటలపై దృష్టి సారించారు.



మేడిపూర్ శివారులో వేరుశనగ పంట

మరికల్: జిల్లాలో యాసంగి వరిసాగు జోరందుకోవడమే కాకుండా కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద వరినాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే బోరు బావుల కింద రైతులు నాట్లు వేసే పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెల రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోవడంతో చలి మంచు తీవ్రతకు నారుమళ్లు పెరుగుదలపై ప్రభావం చూపింది. అంతేకాకుండా అనేక రకాల తేగుళ్లు రావడంతో నారుమళ్లను కాపాడుకోవడం కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం నారుమళ్లు పెరగడంతో జిల్లా వ్యాప్తంగా వరిసాగు చేపట్టడంతో కూలీలు కూడా ఎకరాకు రూ.4 వేల చొప్పున నాట్లు వేస్తున్నారు.

కోయిల్‌సాగర్ కింద జోరందుకున్న వరిసాగు

కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో యాసంగి వరి సాగు ముమ్మరంగా సాగవుతుంది. నీటి పారుదల శాఖ అధికారులు ఈ నెల 6 నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. విడుదలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఆరుతడి పంటలు వేయాలని అధికారులు చెప్పిన రైతులకు బోర్లు ఉండటంతో అందరు వరి పంటనే సాగు చేస్తున్నారు.

ప్రస్తుతానికి పాత ఆయకట్టుకు సాగునీరు..

ప్రస్తుతం పాత ఆయకట్టుకు మాత్రమే సాగునీరు విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. దీని పరిధిలో 12వేల ఎకరాలు, దేవరకద్ర మండలంలో ఉన్న ఎడమ కాల్వ కింద మూడు వేల ఎకరాలు, ధన్వాడ, మరికల్, చిన్నచింతకుంట మండల్లాల పరిధిలో ఉన్న కుడి కాల్వ కింద తొమ్మిది వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో పూర్తి స్థాయిల్లో నీటిమట్టం ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఆయకట్టు కింద ఉన్న తూములపై రైతులకు ఎన్నో సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి


బోయ పరమేష్ (ఫైల్)

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో బోయ పరమేష్ (28) గ్రామ సమీపంలోని ఊర చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పరమేష్ ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తరచుగా మద్యం సేవించే అతను సాయంత్రం గ్రామ సమీపంలోని ఊర చెరువులోకి బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగాడు. ఈత రాకపోవడంతోపాటు మూర్ఛ వ్యాధిగ్రస్తుడు కావడంతో నీట మునిగి చనిపోయాడు. చీకటి పడుతున్నా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికి చివరకు అనుమానంతో చెరువు వద్ద చూడగా నీళ్ల అంచున కాలి చెప్పులు కన్పించాయి. చెరువు నిండా నీరు ఉండటంతో రాత్రి నీటిలో వెతికినా అతని ఆచూకీ లభించలేదు. సోమవారం మరోసారి చెరువు నీటిలో గాలించగా పరమేష్ మృతదేహం కన్పించింది.

బైక్, కారు ఢీకొని యువకుడి దుర్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: బైక్, కారు ఎదురెదురుగా ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్దముద్దునూరులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. కోడేరు మండలం బాడుగదిన్నెకు చెందిన బైరపోగు శివకుమార్(28) జిల్లాకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో ఫీల్డ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. ఈయన ఆదివారం అర్ధరాత్రి స్వగ్రామం నుంచి నాగర్‌కర్నూల్‌కు బైక్‌పై వస్తుండగా పెద్దముద్దునూరు వద్ద కారు ఢీకొనడంతో కిందపడి తీవ్రగాయాలయ్యాయి. అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. మృతుడి తండ్రి కుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి మరో వ్యక్తి..

మదనాపురం: ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మదనాపురం మండలం కొన్నూరుకు చెందిన గొర్రెలకాపరి ముచ్చెర్ల నాగన్న (43) ఆదివారం రాత్రి బైక్‌పై అమ్మాపూర్‌వైపు వెళ్తూ అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా.. నాగన్న మృతిపై అనుమానాలు ఉన్నాయని అతడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.


అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: కేసరి సముద్రం చెరువు తూములో అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు.. జడ్చర్లకు చెందిన పూసలి మొగులాలి సోమవారం ఉదయం కొత్తకోటలోని తన అక్క ఇంటికి వెళ్లేందుకు బయటకు వచ్చాడు. కాగా అనుమానాస్పస్థితిలో జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులో మృతి చెంది ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, ఫైర్ అధికారులు చేరుకుని మృతదేహాన్ని తూము నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోనేరులో దూకి మహిళ ఆత్మహత్య

జడ్చర్ల: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం పక్కన గల కోనేరులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక వెంకటేశ్వరకాలనీకి చెందిన మణెమ్మ(48) కోనేరులోకి దూకింది. వెంటనే స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది నీటిలో మునిగిన మహిళను బయటకు తీశారు. అప్పటికే ఆమె మృతి చెందింది. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భావిస్తున్నారు. మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

యువకుడిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న గిరిధర్

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం 8 గంటల ప్రాంతంలో బ్రహ్మంగారి ఆలయం వద్ద పెంట్లవెల్లి, చౌటబెట్ల గ్రామాలకు చెందిన యువకుల మధ్య మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. చౌటబెట్లకు చెందిన యువకులు పెంట్లవెల్లికి చెందిన గోపినాయుడు కుమారుడు గిరిధర్‌పై పొట్టభాగంలో కత్తితో దాడి చేశారు. అదే విధంగా గోపి కుమారుడు శివకు కిట్టుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న స్థానికులు వారిని కొల్లాపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ఐదో శక్తిపీఠం.. జనసంద్రం

- జోగుళాంబ ఆలయానికి పోటెత్తిన భక్తులు
- దర్శనానికి 3గంటల సమయం
- భక్తుల రద్దీని నియంత్రించిన ఈఓ, చైర్మన్


భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

జోగుళాంబ శక్తిపీఠం: 2024 ఆంగ్లనామ సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి.. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఉదయం 10గంటల నుంచి భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరగడంతో దర్శనాలకు 3గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటనారాయణరెడ్డిలు వీఐపీ దర్శనాలను బ్రేక్ చేశారు. అంతటితో ఆగకుండా భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనాలు చేయిచడంతో పాటు గర్భాలయం నుంచి త్వరగా బయటికి పంపిస్తూ.. భక్తుల రద్దీని నియంత్రించారు.

గుంపులో గుంజుడు ధోరణి..

సందెట్లో సడేమియా అన్నట్లు కొబ్బరి చిప్పలను పోగు చేసుకునే గుత్తేదారులు కొత్త అవతారం ఎత్తారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తులు తెచ్చిన టెంకాయలు కొడుతూ రూ.10 చొప్పున వసూలు చేశారు. విషయాన్ని హిందూ ధార్మిక సేన రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ శర్మ ఆలయ ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. గుత్తేదారులు గుంపులో గుంజుడు ధోరణికి తెరలేపారని ఫిర్యాదు చేశారు.

అన్నప్రసాద సత్రంలో భక్తుల అవస్థలు..

ఎప్పటిలాగే 500 మందికి అన్నప్రసాదం అందించేందుకు ఏర్పాట్లు చేసిన అధికారులకు చుక్కెదురయ్యింది. నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు అధికంగా తరలిరావడంతో వెయ్యి మందికి సరిపడా భోజనాలు తయారు చేయించారు. అయినప్పటికీ మరింత మంది భక్తులు రావడంతో దేవస్థానం అధికారులు చేతులెత్తేశారు. దీంతో భక్తులు చేసేదిలేక పులిహోర ప్రసాదాలతో సరిపెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఆలయం నుంచి గాంధీచౌక్ వరకు వాహనాలు నిలిచిపోయాయి.


బాలబ్రహ్మేశ్వరస్వామికి పూజలు చేస్తున్న బీజేపీ నాయకురాలు డీకే అరుణ

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు..

జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ, చైర్మన్ ఘన స్వాగతం పలికారు. ఉభయ ఆలయాల్లో పూజలు చేయించిన అనంతరం అర్చకులు తీర్థప్రసాదం అందజేశారు. అదేవిధంగా బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

మన్యంకొండలో భక్తజన సందోహం

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానం సోమవారం భక్తజన సందోహంతో పులకించిపోయింది. నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. ముందుగా కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. ఉదయం 7గంటల నుంచే ఆలయ ప్రధాన ముఖద్వారం నుంచి గర్భగుడి వరకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. అదేవిధంగా శివాలయం, అలివేలు మంగతాయారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.


మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



కురుమూర్తికి తరలివచ్చిన భక్తులు

చిన్నచింతకుంట: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం కురుమూర్తి స్వామిని దర్శించుకునేందుకు ఆలయానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు సుప్రభాత సేవ నిర్వహించిన.. భక్తులకు దర్శనం కల్పించారు. అలువేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, చెన్నకేశవస్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తుల సందడి కనిపించింది.


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

సీఎంఆర్ ధాన్యం మాయం

రైస్‌మిల్ యజమానులపై కేసు నమోదు

పాన్‌గల్: వనపర్తి జిల్లాలో సీఎంఆర్ కోసం ఇచ్చిన ధాన్యాన్ని మాయం చేసిన రైస్‌మిల్ యజమానులపై పోలీస్ కేసు నమోదు అయ్యింది. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వేణు వెల్లడించారు. పాన్‌గల్‌లోని పరమేశ్వరి రైస్‌మిల్‌లో రూ.74,12,052 విలువగల 10,469 బస్తాల ధాన్యం, మాందాపూర్ మీనాక్షి మిల్లులో రూ.18,55,47,496 విలువజేసే 2,25,179 బస్తాలు, మాందాపూర్ ఇసాన్ అగ్రోటెక్ మిల్లులో రూ.3,25,10,096 విలువగల 39,454 బస్తాల ధాన్యాన్ని సీఎంఆర్ కోసం ప్రభుత్వం అప్పగించింది. ఆయా రైస్‌మిల్లులు ఒకే కుటుంబానికి చెందినవి కాగా.. రూ.22.54 కోట్ల విలువైన 2.75 లక్షల ధాన్యం బస్తాలను మాయం చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా ధాన్యాన్ని మాయం చేసిన ఆయా మిల్లుల యజమానులు పరమేశ్వర్‌రెడ్డి, మధుకుమార్‌రెడ్డిలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

న్యూ ఇయర్ కేక్ తీసుకొస్తూ..

కల్వర్టును బైక్ ఢీకొని యువకుడు మృతి


ఆంజనేయులు(ఫైల్)

మిడ్జిల్: కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించుకునేందుకు కేక్ తీసుకొస్తూ, మార్గమధ్యలో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి మున్ననూర్ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్వేర్‌కు చెందిన ఆంజనేయులు (26) ఆదివారం రాత్రి 12గంటల తర్వాత మిడ్జిల్‌లో ఉన్న భార్యా,పిల్లలతో కలిసి నూతన సంవత్సర వేడుకలు చేసుకోవాలని బైక్‌పై గ్రామం నుంచి బయలుదేరి వస్తుండగా, మున్ననూర్ వద్ద కల్వర్టును ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

నవాబుపేటలో మరో యువకుడు..


సాయికుమార్ (ఫైల్)

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన సాయికుమార్(20) తన మిత్రులతో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నాడు. అనంతరం రాత్రి 2 గంటల ప్రాంతంలో బైక్‌పై వెళ్తూ రోడ్డు పక్కన ఉన్న కరెంట్ స్తంభానికి ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అటుగా వెళ్తున్న పోలీసులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఎంపీడీఓ మృతి


ఎంపీడీఓ జయసుధ(ఫైల్)

కల్వకుర్తి: చారకొండ మండల ఎంపీడీఓ జయసుధ(46) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ.. మృతిచెందారు. డిసెంబర్ 28 రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబ సభ్యులు వెల్దండ సమీపంలోని యన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలియజేశారు. వారి మృతదేహాన్ని కల్వకుర్తిలోని వారి స్వగృహానికి తరలించారు. చారకొండ మండల ఎంపీడీఓగా ఆరేళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆమెకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమె అకాల మరణంతో బంధువులు, స్నేహితులు మండలంలోని ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. స్వగృహంలో వారి పార్థీవ దేహానికి అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, మండలంలోని ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, ఆయా శాఖల అధికారులు, నాయకులు పార్థివ దేహానికి నివాళి అర్పించారు.

విద్యుదాఘాతంతో టీకొట్టు దగ్ధం



మరికల్: విద్యుదాఘాతంతో టీకొట్టు దగ్ధమైన ఘటన ఆదివారం అర్ధరాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కుర్వ వెంకటేశ అనే మహిళ పెట్రోల్‌బంకు సమీపంలో టీకొట్టుతో జీవనం సాగిస్తుంది. ఆదివారం వ్యాపారం ముగించుకొని డబ్బాకు తాళం వేసి ఇంటికి వెళ్లింది. అర్ధరాత్రి సమయంలో విద్యుదాఘాతంతో డబ్బాలో ఉన్న ఫ్రిజ్, కుర్చీలు, ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. కుర్వ వెంకటేశకు సూర్యచంద్ర ఫౌండేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మరింత ఆర్థికసాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఆమెకు ధైర్యం చెప్పారు.

అగ్ని ప్రమాదంలో వరిగడ్డి, ఎద్దుల బండి దగ్ధం



తెలకపల్లి: అగ్నిప్రమాదంలో వరిగడ్డితో పాటు ఎద్దుల బండి దగ్ధమైంది. గ్రామస్తులు బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గౌరారంలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బోయపుల్లయ్య వరిగడ్డిని ఎద్దుల బండిపై వేసి ఉంచాడు. ఎద్దులను మేపేందుకు దూరంగా తీసుకెళ్లి మేపుతున్నాడు. ప్రమాదవశాత్తు చుట్టూ ఉన్న ఎండు గడ్డికి నిప్పంటుకోవడంతో మంటలు చెలరేగాయి. మంటలు వరిగడ్డి మొత్తం అంటుకుంటూ ఎద్దుల బండిపై ఉన్న వరిగడ్డి దగ్ధమై గడ్డితో పాటు బండి కూడా కాలిపోయింది. ఈ ప్రమాదంలో బండి గడ్డి దగ్ధం కావడంతో బండి విలువ రూ.50 వేలు ఉంటుందని, గడ్డితో పాటు మొత్తం రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వ అధికారులు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని బాధితుడు, గ్రామస్తులు కోరారు.

రెండు స్కూల్ బస్సులు ఢీ

ఆరుగురు విద్యార్థులకు గాయాలు


ఆస్పత్రిలో చేరిన గాయపడిన విద్యార్థి

జడ్చర్ల టౌన్ (తిమ్మాజిపేట): నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం మరికల్ సమీపంలో సోమవారం రాత్రి రెండు స్కూల్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఆరుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలిలా.. జడ్చర్ల మండలం నాగసాల సమీపంలో ఉన్న ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులను రెండు బస్సులలో సోమవారం బిజినేపల్లి మండలం వట్టెం దేవాలయానికి వెళ్లి అక్కడ పూజలు ముగిశాక పాఠశాలకు తిరుగు ప్రయాణం అయ్యారు. స్కూల్ బస్సులు రెండు ఒకదాని వెంట మరోటి ప్రయాణిస్తున్నాయి. ఈ సమయంలో మరికల్ సమీపంలో ఎదురుగా ఉన్న కారును తప్పించేందుకు ముందు వెళ్తున్న బస్సు సడన్ బ్రేక్ వేయటంతో వెనకాలే వస్తున్న మరో బస్సు దానిని ఢీకొట్టింది. దీంతో ఒక్కసారిగా విద్యార్థులకు ఏం జరిగిందో తెలియక కేకలు పెట్టారు. రెండు రెండు బస్సుల్లో ఉన్న విద్యార్థులు ఒక్కసారిగా ముందు సీట్లకు గుద్దుకున్నారు. కొందరు విద్యార్థులకు మూగదెబ్బలు తగలగా నిఖిల్, భాను, చైతన్య, జానకిరాం, విద్వాన్, సాయితేజలకు గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థులను ప్రైవేట్ వాహనాల్లో జడ్చర్ల పట్టణంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో బస్సుల వెనకాల మరో వాహనం లేకపోవటంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. భారీ వాహనం వచ్చిఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేది. ఘటనా స్థలానికి స్కూల్ ప్రతినిధులు చేరుకుని విద్యార్థులను సురక్షితంగా పాఠశాలకు తీసుకువెళ్లారు.

షార్ట్‌సర్క్యూట్‌తో చెరుకు తోట దగ్ధం


కాలిపోయిన చెరుకుతోటను పరిశీలిస్తున్న సంగం నాయకులు

అమరచింత: పట్టణానికి చెందిన నారాయణ రెడ్డి, చంద్రన్నలకు చెందిన ఏడు ఎకరాల చెరుకు తోట షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధం కాగా.. రూ.3.50 లక్షల నష్టం వాటిల్లింది. ప్రమాదవశాత్తు చెరుకుతోటలో మంటలు వ్యాపించడంతో సమీప రైతులు నీటిని పిచికారి చేసి మంటలను ఆర్పివేశారు. అప్పటికే డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాయని బాధిత రైతులు వాపోయారు. కాలిన పంటను కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం వెంటనే కటింగ్ చేసి ఫ్యాక్టరీకి తరలించాలని చెరుకు సంగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం కాలిన చెరుకు తోటను ఫ్యాక్టరీ సిబ్బందితో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ఏఓ ఆశీఫ్, ఫీల్డ్‌మెన్ రాజుతో పాటు పలువురు ఉన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి యువకుడి మృతి

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సోమశిల సమీపంలో ఉన్న కృష్ణానదిలో ప్రమాదవశాత్తు పడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతాకు చెందిన కౌశిక్ (22)ఏడాదిగా హైదరాబాద్‌లో ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం నూతన సంవత్సర వేడుకలను సోమశిలలో నిర్వహించేందుకు 20మంది తన స్నేహితులతో కలిసి వచ్చాడు. రాత్రి ఉత్సాహంగా వేడుకలు చేసుకొని.. రాత్రి అక్కడే బస చేశాడు. సోమవారం ఉదయం కౌశిక్ ఒక్కడే నదిలోకి స్నానం చేయడానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నదిలో ఉన్న బురుదలో ఇరుక్కొని చనిపోయాడు. అక్కడే ఉన్న మత్స్యకారులు అలివి వలలు వేసి బయటి తీశారు. పోలీసులు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.


బటయ్ ఫ్లయ్ వద్ద ఫొటోలు దిగుతున్న అమ్మాయిలు


చిన్నారులు, పెద్దల ఆటవిడుపు




కేసీఆర్ ఎకో అర్బన్ పార్కులో ప్రజల సందడి

నూతనోత్సాహం

కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లాలో సోమవారం పండుగ వాతావరణం నెలకొంది. ఇళ్ల ముందు వివిధ ఆకృతుల్లో రంగవల్లులతో అలంకరించారు. మధ్యలో 'వెల్‌కం న్యూఇయర్–2023' అనే అక్షరాలతో ముగ్గులు తీర్చిదిద్దారు. ఉదయమే ఆలయాలకు వెళ్లి దేవుళ్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మసీదులు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మహబూబ్‌నగర్ సమీపంలోని మయూరి కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్‌కు సందర్శకులు తరలివచ్చారు. ఎక్కడా చూసినా ప్రజలతో పార్క్ కిటకిటలాడింది. పిల్లలమర్రిలోనూ సందర్శకులు సందడి చేశారు. ప్రతి ఒక్కరిలో నూతనోత్సాహం కనిపించింది.

– స్టేషన్ మహబూబ్‌నగర్


జారుడ బండపై చిన్నారుల కేరింతలు


పార్కులో అందరితో కలిసి..

ఏపీ విద్యుత్ సంస్థలకు ప్రతిష్టాత్మక అవార్డులు

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా అత్యుత్తమ పని తీరు కనబరిచిన విద్యుత్ సంస్థలకు అందించే 'ఫాల్కన్ మీడియా–ఎనర్షియా ఫౌండేషన్' జాతీయ అవార్డులను ఏకంగా మూడింటిని ఏపీ విద్యుత్ సంస్థలు పొందాయి. ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఏపీ ట్రాన్స్‌కో)కు 'టాప్ స్టేట్ యుటిలిటీ ఫర్ ఎనర్జీ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' అవార్డు లభించింది. పంప్డ్ స్టోరేజీ పవర్ ప్రాజెక్ట్‌ల ప్రచారానికి సంబంధించి దేశంలోనే బెస్ట్ స్టేట్ టాప్ రెన్యూవబుల్ ఎనర్జీ నోడల్ ఏజెన్సీగా న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) అవార్డును కైవసం చేసుకుంది. రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్స్ (పునరుత్పాదక విద్యుత్ కొనుగోలు బాధ్యత) లక్ష్యాన్ని చేరుకోవడంలోనూ ముందంజలో ఉన్న ఉత్తమ రాష్ట్రంగా ఏపీ విద్యుత్ సంస్థలను అవార్డు వరించింది. డిసెంబర్ 29న ముంబైలో ఈ అవార్డులను అందించారు.



సీఎం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు

సాక్షి, అమరావతి/తిరుమల: ముఖ్యమంత్రి నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. తాడేపల్లిలోని సీఎం నివాసంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌కు సీఎస్ జవహర్‌రెడ్డితో పాటు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం, ఇంద్రకీలాద్రి శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, అమరావతిలోని అమరేశ్వరస్వామి దేవస్థానం వేద పండితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను, టీటీడీ క్యాలెండర్, డైరీలను అందజేశారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చావిడిమామిడిలో లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



పండుగలా పింఛన్ల పంపిణీ

పెంచిన మొత్తంతో అవ్వాతాతల కళ్లలో వెల్లివిరిసిన ఆనందం

సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరంలోనూ ఏపీలో పింఛన్ల పంపిణీ పండుగలా మొదలైంది. తాజాగా పెంచిన మొత్తంతో కలిపి రూ.మూడు వేల చొప్పున ఈనెల పింఛన్ డబ్బులు అందుకున్న అవ్వాతాతల కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. ఇప్పటివరకూ ప్రతినెలా ఇచ్చే రూ.2,750 పెన్షన్ మొత్తాన్ని ఈ జనవరి ఒకటి నుంచి రూ.మూడు వేలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని 8వ తేదీ వరకు మండలాల వారీగా ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మరోవైపు.. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి కొత్తగా మరో 1,17,161 మందికి పింఛన్లు మంజూరు చేసింది. దీంతో మొత్తంగా ఈ నెలలో 66.34 లక్షల మందికి రూ.1,968 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది.

ఆరోగ్య సురక్ష రెండో దశ

- రేపటి నుంచి నగరాలు, పట్టణాల్లో కార్యక్రమానికి శ్రీకారం
- ఆరు నెలల్లో 13,954 శిబిరాల నిర్వహణకు వైద్య శాఖ ప్రణాళిక

నేటి నుంచి గ్రామాల్లో రెండో దశ ప్రారంభం



సాక్షి, అమరావతి: ఏపీలో ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా చేపట్టిన అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జగనన్న ఆరోగ్య సురక్ష '(జేఏఎస్) రెండో దశ అమలుకు వైద్య ఆరోగ్య శాఖ సన్నద్ధమైంది. నేటి నుంచి గ్రామాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుండగా వారానికి రెండు రోజుల చొప్పున మంగళ, శుక్రవారాల్లో జేఏఎస్‌ను నిర్వహిస్తారు. ఇక పట్టణాలు, నగరాల్లో రెండో దశ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభం కానుంది. తొలిదశలో భాగంగా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్‌లో 50 రోజులపాటు జగనన్న సురక్ష ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున వైద్య శిబిరాలను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. సొంత ఊళ్లలోనే 60 లక్షల మంది ప్రజలకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలందించింది. నిరంతరాయంగా కార్యక్రమాన్ని కొనసాగించడంలో భాగంగా రెండో దశను చేపట్టారు.

ఆరు నెలల్లో 13,954 శిబిరాలు

జేఏఎస్ రెండో దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆరు నెలల్లో 13,954 సురక్ష శిబిరాలు నిర్వహించేలా వైద్య శాఖ ప్రణాళిక రూపొందించింది. గ్రామాల్లో 10,032, పట్టణాలు, నగరాల్లో 3,922 చొప్పున శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ నెలలో 3,583 శిబిరాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామం చొప్పున, మునిసిపాలిటీల్లో వారానికి ఒక వార్డు చొప్పున రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలను ఆరు నెలల్లో కవర్ చేసేలా శిబిరాలను నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో స్థానిక మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, పారామెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ ఉంటారు. ప్రజలకు సొంత ఊళ్లలో స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 జనరల్ మెడిసిన్, 645 గైనకాలజిస్ట్, 349 జనరల్ సర్జన్, 345 ఆర్థోపెడిక్స్, 378 మంది చొప్పున ఇతర స్పెషలిస్ట్ వైద్యులను, కంటి సమస్యల స్క్రీనింగ్ కోసం 562 మంది పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లను నియమించారు. వైద్య శిబిరాల్లో అవసరమైన అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు ఏడు రకాల కిట్లు శిబిరాల్లో అందుబాటులో ఉంటాయి.

చేయి పట్టి నడిపిస్తూ..

వైద్య శిబిరాల ద్వారా సొంతూళ్లలో వైద్య సేవలు అందించడమే కాకుండా అనారోగ్య బాధితులను వైద్య పరంగా ప్రభుత్వం చేయి పట్టుకుని నడిపిస్తోంది. జేఏఎస్ శిబిరాల నుంచి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రిఫర్ చేసిన రోగులను ఫ్యామిలీ డాక్టర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, ఏఎన్ఎంలు పర్యవేక్షిస్తారు. వీరు ఆస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందడం కోసం ప్రభుత్వం ఇప్పటికే ప్రయాణ చార్జీల కింద రూ.500 చొప్పున అందజేస్తోంది. రిఫరల్ రోగులను ఆస్పత్రులకు తరలించి అక్కడ ఉచితంగా అన్ని వైద్య సేవలు అందేలా సమన్వయం చేస్తారు. జీజీహెచ్‌లు, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య సురక్ష రిఫరల్ కేసుల కోసం ప్రత్యేక కౌంటర్‌లు ఉంటాయి. దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం వైద్య పరంగా అండగా నిలుస్తోంది. వీరికి ఉచిత కన్సల్టేషన్‌లతో పాటు కాలానుగుణంగా ఉచితంగా మందులు అందజేస్తోంది.

పేట్రేగిన టీడీపీ-జనసేన మూకలు.. మంత్రి రజిని కార్యాలయంపై రాళ్ల దాడి

గుంటూరులో అర్ధరాత్రి అరాచకం..

- న్యూఇయర్ వేడుకల ముసుగులో ర్యాలీ
- వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా నినాదాలు
- మంత్రి కొత్త ఆఫీసుపై రాళ్ల వర్షం
- అడ్డుకున్న పోలీసులపైనా దౌర్జన్యం.. సెక్యూరిటీ గార్డుపై దాడి



మంత్రి రజిని కార్యాలయంపై జరిగిన రాళ్ల దాడిలో ధ్వంసమైన అద్దాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/గుంటూరు ఈస్ట్/సాక్షి, అమరావతి/సత్తెనపల్లి: టీడీపీ, జనసేన మూకలు గుంటూరులో విధ్వంసానికి తెరలేపాయి. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తమవుతున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని కొత్త కార్యాలయంపై ఆ మూకలు రాళ్ల దాడి చేశాయి. దీంతో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు చంద్రమౌళినగర్ మెయిన్‌రోడ్డులో మంత్రి రజిని పార్టీ నూతన కార్యాలయాన్ని ఏర్పాటుచేస్తున్నారు. సోమవారం ఉదయం ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత తెలుగుదేశం, జనసేన కార్యకర్తల ముసుగులో కొందరు గూండాలు పెద్ద సంఖ్యలో ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వచ్చారు. ముందుగా పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద నూతన సంవత్సర వేడుకల పేరుతో నిబంధనలు ఉల్లంఘించి రాత్రి 12 గంటల తర్వాత కేక్ కటింగ్ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి వ్యతిరేకంగా.. తెలుగుదేశం, జనసేన జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ మంత్రి కార్యాలయంపై రాళ్లు రువ్వారు. ఈ సంఘటనలో కార్యాలయం అద్దాలు ధ్వంసమయ్యాయి. కార్యాలయం మొత్తం టీడీపీ రౌడీమూకలు విసిరిన రాళ్లతో నిండిపోయింది. అడ్డుకున్న పోలీసులపై దౌర్జన్యానికి దిగారు. లోపలకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న వారిని ఆఫీసు సెక్యూరిటీ మాసారపు చిరంజీవి అడ్డుకోబోతే అతనిపైనా దాడిచేశారు. కార్యాలయం ప్రారంభానికి సంబంధించిన ఫ్లెక్సీలను టీడీపీ మూకలు చించివేశాయి. పోలీసులు 30 మందిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో సుమారు వంద మంది పాల్గొన్నట్లు పట్టాభిపురం పోలీసులు నిర్ధారించారు. మిగిలిన వారిపైన చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు.

పథకం ప్రకారమే దాడి..

ఈ దాడి పథకం ప్రకారమే జరిగిందని పోలీసులు చెబుతున్నారు. ఎందుకంటే.. మంత్రిని ఇటీవలే గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఈ నేపథ్యంలో చంద్రమౌళినగర్‌లో పార్టీ కార్యాలయాన్ని ఆమె ఏర్పాటు చేస్తున్నారు. అలాగే, పశ్చిమ నియోజకవర్గం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ఆమె విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆమెకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రత్యర్థులు దాడికి దిగినట్లు తెలిసింది.

బీసీ మహిళపై టీడీపీ రౌడీయిజం : మంత్రి రజిని

ఈ ఘటనపై మంత్రి రజిని స్పందిస్తూ.. తన పార్టీ కార్యాలయంపై దాడి టీడీపీ గూండాల అధికార దాహానికి పరాకాష్ట అని మండిపడ్డారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి ఒక బీసీ మహిళ పోటీచేయడాన్ని చూసి తట్టుకోలేక టీడీపీ గూండాలు దాడులకు తెగబడ్డారన్నారు. వారికి ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని.. అందుకే ధ్వంస రచనకు తెరతీశారని ఆమె ఆరోపించారు. పక్కా ప్రణాళిక ప్రకారమే దాడి జరిగిందన్నారు. వాహనాల ద్వారా బస్తాల్లో రాళ్లు తీసుకొచ్చి పార్టీ కార్యాలయంపై విసిరారని.. ఈ దాడి వెనుక ఎవరున్నా వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. మంత్రి కార్యాలయంపైనే టీడీపీ రౌడీమూకలు దాడులకు పాల్పడ్డాయంటే.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటో అర్థంచేసుకోవచ్చన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులకు రక్షణే ఉండదన్నారు. ఇలాంటి వారి చేతుల్లో అధికారం పెడితే.. రాష్ట్రం సర్వనాశనమవుతుందని మంత్రి చెప్పారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తి నీటిమట్టం 1,020 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 325 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రసీల్‌రెడ్డి తెలిపారు.

మహబూబ్‌నగర్ లోక్‌సభ సీటును బీసీలకు ఇవ్వాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ సీటును బీసీలకు కేటాయించాలని, లేని పక్షంలో ఆయా పార్టీలను బొంద పెడుతామని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాస్ సాగర్ హెచ్చరించారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నాయని వాపోయారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 60 శాతం ఓటర్లు ఉన్న బీసీలు గెలుపులో కీలకపాత్ర పోషిస్తారని అన్నారు. అలాంటి బీసీలను రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. బీసీ అభ్యర్థులకు టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. సమావేశంలో బీసీ సమాజ్ కోకన్వీనర్ సత్యం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలమూరులో క్రీడాసౌరభం



తలపడుతున్న మహబూబ్‌నగర్, హైదరాబాద్ బాలికల జట్లు

- అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీ
- ఉత్సాహంగా పాల్గొన్న ఉమ్మడి పది జిల్లాల జట్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్ మైదానంలో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్ అట్టహాసంగా ప్రారంభమైంది. పోటీలకు రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల బాలబాలికల జట్లు తరలివచ్చాయి. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించి టోర్నీని ప్రారంభించారు. గ్రామర్ స్కూల్ మైదానంలో బాలికల మ్యాచ్‌లు, శ్రీరామల్యాండ్ మార్క్‌లో బాలుర మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. కొన్ని మ్యాచ్‌లు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగాయి.

శుభారంభం చేసిన పాలమూరు జట్లు..

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాలమూరు ఉమ్మడి జిల్లా బాలబాలికల జట్లు శుభారంభం చేశాయి. ఉమ్మడి జిల్లా బాలుర జట్టు మొదటి మ్యాచ్‌లో 15–4 గోల్స్ తేడాతో నల్గొండ జట్టుపై, మరో మ్యాచ్‌లో 15–4 గోల్స్ తేడాతో ఆదిలాబాద్ జట్టుపై గెలుపొందింది. పాలమూరు బాలికల జట్టు 8–6 గోల్స్ తేడాతో మెదక్ జట్టుపై, 10–9 తేడాతో హైదరాబాద్ జట్టుపై విజయం సాధించింది. బాలుర విభాగం మ్యాచుల్లో ఆదిలాబాద్ జట్టు 9–8 తేడాతో నల్గొండపై, కరీంనగర్ జట్టు 10–6 తేడాతో ఖమ్మంపై, ఆదిలాబాద్ జట్టు 11–6 తేడాతో ఖమ్మంపై, నల్గొండ జట్టు 12–8 తేడాతో కరీంనగర్ జట్టుపై, వరంగల్ జట్టు 11–5 తేడాతో రంగారెడ్డి జట్టుపై, వరంగల్ జట్టు 13–10 తేడాతో మెదక్‌పై, మెదక్ జట్టు 9–8 తేడాతో హైదరాబాద్‌పై, నిజామాబాద్ జట్టు 10–5 గోల్స్ తేడాతో రంగారెడ్డి జట్టుపై విజయాలు నమోదు చేసుకున్నాయి. బాలికల విభాగం మ్యాచుల్లో ఖమ్మం జట్టు 16–8 గోల్స్ తేడాతో హైదరాబాద్ జట్టుపై, కరీంనగర్ జట్టు 24–11 గోల్స్ తేడాతో నిజామాబాద్‌పై గెలుపొందాయి. బాలికల విభాగంలో ఆదిలాబాద్ జట్టు 7–6 గోల్స్ తేడాతో ఖమ్మంపై, కరీంనగర్ జట్టు 6–3 తేడాతో నిజామాబాద్‌పై, ఆదిలాబాద్ జట్టు 13–3 తేడాతో రంగారెడ్డిపై, ఖమ్మం జట్టు 11–5 తేడాతో నిజామాబాద్‌పై, హైదరాబాద్ జట్టు 9–6 తేడాతో మెదక్ జట్టుపై గెలుపొందాయి.



వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



టోర్నీ ప్రారంభోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజు ఇక్కడ నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు మరిచిపోలేని జ్ఞాపకంగా ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమని, ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. అన్ని జిల్లాల క్రీడాకారులు పిల్లలమర్రిని సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డీఈఓ రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రష్మిత, ఏఎంఓ బాలుయాదవ్, సీఈఓ డి.శ్రీనివాస్, గ్రామర్ స్కూల్ కరస్పాండెంట్ రాజేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శాంత, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేష్‌బాబు, ఎండీసీఏ ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, టోర్నీ పరిశీలకులు పుల్లయ్య, శ్రీనివాస్, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి జియావుద్దీన్, ఉపాధ్యక్షుడు అనిల్, వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, నిరంజన్‌రావు, బాల్‌రాజు, అహ్మద్ హుస్సేన్, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థి మృతి

- తరగతి గదిలో ఉరి వేసుకున్నట్లు చెబుతున్న కళాశాల సిబ్బంది
- కుటుంబ సభ్యుల ఆందోళన
- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్



రాంరెడ్డి(ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సోమవారం కళాశాల తరగతి గదిలో అనుమానాస్పదంగా మృతి చెందడం పాలమూరులో కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి మండలం భూనీడుకు చెందిన ముదేలి రాంరెడ్డి (17) మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో ఇంటర్ సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3.30 ప్రాంతంలో సదరు విద్యార్థి తరగతి గదిలోకి వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. ఆ తర్వాత కెమెరాను గోడవైపు తిప్పి ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నట్లు తెలుస్తోంది. సెలవు రోజు కావడంతో ఎవరూ గమనించలేదు. కళాశాల అధికారులు ఇతర సిబ్బంది ఉదయం 9 గంటల ప్రాంతంలో తరగతి గదిని తెరిచి చూడగా.. విద్యార్థి ఉరి వేసుకుని కనిపించాడు. వెంటనే జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి తండ్రి హన్మంత్‌రెడ్డి, ఇతర బంధువులు ఆస్పత్రికి చేరుకుని కళాశాల సిబ్బందిని నిలదీశారు. తన కుమారుడు మరణించిన విషయం తమకు చెప్పకుండా దాచిపెట్టడంతో పాటు పోలీసులకు సైతం సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని కళాశాల నుంచి తరలించడంపై తప్పు పట్టారు. కాగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాల వద్ద హైడ్రామా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ బుర్హా ఫాతిమా, హౌస్ మాస్టర్ ఖాద్రీ అక్కడికి రావాలని ఆందోళన నిర్వహించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ టి.మహేష్, సీఐలు ప్రవీణ్‌కుమార్, సైదులు, చంద్రశేఖర్, శ్రీనివాసులు కళాశాల వద్దకు చేరుకుని బాధితులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని షాషాబ్‌గుట్ట చౌరస్తా రోడ్డుపై ఆందోళన చేయడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా.. డిసెంబర్ 31న విధులు నిర్వహించిన సిబ్బంది తన కుమారుడిని ఇబ్బందులకు గురిచేశారని.. తన కుమారుడి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హన్మంత్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.



బంధువులతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేష్, మైనార్టీ అధికారులు



44వ నంబరు జాతీయ రహదారిపై మల్లెబోయిన్‌పల్లి వద్ద సైకిల్ యాత్ర

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో సైకిల్‌యాత్ర

- ఇండియా టూర్ చేపట్టిన షానురాజ్‌పుత్

జడ్చర్ల టౌన్: సైకిల్ తొక్కుతూ ఆరోగ్యంగా ఉండాలంటూ జమ్ముకాశ్మీర్ సాంబజిల్లా రాయికల్ లబానకి చెందిన షానురాజ్‌పుత్ ప్రజలను చైతన్య పరుస్తూ దేశ యాత్ర చేపట్టాడు. యాత్రలో భాగంగా సోమవారం 44వ నంబరు జాతీయ రహదారి జడ్చర్లకు చేరుకున్నాడు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో తాను దేశ యాత్ర ప్రారంభించానని తెలియజేశాడు. జూలై 17న తన స్వగ్రామంలో సైకిల్ యాత్ర ప్రారంభించి పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో యాత్ర ముగించి తెలంగాణ రాష్ట్రంలో కొనసాగిస్తున్నాడు. మరో పది నెలల పాటు సైకిల్‌పై ఆయా రాష్ట్రాలు తిరుగుతూ స్వగ్రామానికి చేరుకుంటానని తెలియజేశారు. యాత్రలో యువకులను కలుసుకుని వారిని చైతన్య పరుస్తూ దేశభక్తిని పెంపొందిస్తున్నట్లు చెప్పాడు. ప్రతిఒక్కరూ సైకిల్ వినియోగించాలని, తద్వారా ఆరోగ్యంగా ఉంటారని అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశాడు. రోడ్డుపై నలుగురు యువకులు కలిసినా.. ఆగి వారితో ముచ్చటిస్తున్నట్లు తెలిపాడు. యాత్రలో మధ్యప్రదేశ్‌లో కొంత ఆటంకం ఎదురైందని, వర్షాల కారణంగా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు వివరించాడు. అలాగే కొన్నిచోట్ల విడిది ఇబ్బంది ఏర్పడిందని, గుట్ట ప్రాంతాలు చూసుకుని టెంట్ వేసుకుని ఉండాల్సి వచ్చిందన్నారు. ఇప్పటి వరకు తిరిగిన 11 రాష్ట్రాల్లో విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ ప్రజల ఆదరణ మాత్రం అంతా ఒకేలా ఉందన్నాడు.

వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యం



కమ్మరి కృష్ణయ్య (ఫైల్)

కొత్తకోట రూరల్: కొత్తకోట మండలం పాలెంలో స్నేహ దాభా సమీపంలోని కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్టు కొత్తకోట పోలీసులు సోషల్ మీడియాలతో పాటు వివిధ పత్రికల్లో వైరల్ చేశారు. మృతుడి బంధువులు వచ్చి ఎస్ఐ మంజునాథ్‌రెడ్డిని కలిసి మృతి చెందిన వ్యక్తికి సంబంధించిన బ్యాగు, దుస్తులు చూసి గుర్తించారు. మృతుడు కోయిలకొండ మండలం దమాయపల్లికి చెందిన కమ్మరి కృష్ణయ్య(55) కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ వెల్డర్‌గా పనిచేస్తుండేవాడు. నాలుగు రోజుల కిందట మృతుడితో పాటు సూరి అనే వ్యక్తి ఇద్దరు కలిసి పాలెం గ్రామ సమీపంలో కోళ్ల ఫారంలో వెల్డింగ్ చేసేందుకు వచ్చారు. పని పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు వెళ్తున్నట్టు మృతుడు కృష్ణయ్య మిత్రుడైన సూరికి చెప్పి అతడి ఫోన్‌తో భార్య యాదమ్మకు ఫోన్ చేశాడు. నేను గ్రామానికి వస్తున్నానని చెప్పాడు. నాలుగు రోజులుగా ఇంటికి రాకపోవడంతో పేపర్లో, సోషల్ మీడియాలో వచ్చిన కథనాలను చూసి మృతదేహాన్ని గుర్తించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య యాదమ్మతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నట్టు తెలియజేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలియజేశారు.